చీకటి పడుతోంటే శ్రీలత గుండెలో నెమ్మది నెమ్మదిగా భయం చోటు చేసుకో సాగింది.

భయం ... భయం ... భయం ... క్రమ క్రమంగా ఆమె నరనరాల్లోనూ వ్యాపించి, మలేరియా జ్వరం వచ్చిన దానికి మల్లే ఆమె నిలువెల్లా కంపించిపో సాగింది.

వచ్చేస్తాడు ... ఇంకో ఘడియకో, మరి కాస్సేపటికో పీకలమొయ్యా తాగి తూగుతూ తూలుతూ ప్రళయంలా వచ్చేస్తాడు! తుఫానొచ్చినట్టు వచ్చేస్తాడు! ! ... వచ్చి? ...

ఆ పైన జరిగేది మరి వూహించలేకపోయింది శ్రీలత.

ఈ రోజు కొత్త కాదు. రోజూ ఉన్న భాగోతమే అది! అయినా ఏ రోజు కారోజు అది దుర్భరంగానే ఉంటుంది!

ఎందుకంటే .. చిత్రహింసలు పెట్టడంలో కూడా వెరైటీ చూపెడతాడు షణ్ముఖం. ఒకనాడు రూళ్ళకర్రతో గొడ్డును బాదినట్టు బాదితే, మర్నాడు గుడ్డలిప్పించి బెల్టుతో చర్మం కమిలిపోయేలా కొడతాడు. ఒక రోజు పిడిగుద్దులతో ప్రాణా లవిసి పోయేట్టు చేస్తే, మర్నాడు కాళ్ళతో తన్ని తన్ని వదిలిపెడతాడు. 'మందు' మరీ ఎక్కువై తన్నేందు



# మనసున్న మనుషులు

ఎమ్. ఐ. కిషన్

క్కూడా వోపిక లేని వాడు కేవలం ఈటెల్లాంటి మాటలతోనే కుళ్ళబొడిచేస్తాడు.

షణ్ముఖం శాడిస్టు కాదు—ఆమె నలా హింసించడం ద్వారా మానసికంగా ఏదైనా అద్వితీయానందాన్ని అనుభవిస్తున్నాడేమో అనుకోవడానికి.

అతను కేవలం వో తాగుబోతు మాత్రమే.

అయితే తాగుబోతు లందరూ తమ భార్యల్ని అలాగే హింసిస్తారా? ... లేదు. తాగుడు నాగరికతలో వో భాగంగా పరిగణించబడుతున్న ఈ రోజుల్లో మగవారిలో దాదాపు సగం మందికి పైగానే తాగుతున్నారు. కానీ అందరూ భార్యల్ని అలా హింసించరు! ఎంత మితిమీరిన తాగుడైనా మనిషిని ఉన్మత్తుణ్ణి చేస్తుందేమోగాని, రాక్షసుణ్ణి చేయదు.

మరి షణ్ముఖరావు ఎందు కలా చేస్తున్నట్టు?

భార్యపట్ల అంతర్గతంగా పేరుకుపోయిన ద్వేషంతోనా? ... కసితోనా? ... కాదు!

'మనీ మేక్స్ మెనీ థింగ్స్' అని ఆంగ్లంలో వో సామెత. కేవలం షణ్ముఖంలోని ధన పిపాసే అతన్నలా రాక్షసుడిగా మార్చింది.

మానవత్వాన్ని వీడి రాక్షసుడిలా ప్రవర్తించాలంటే ఏ మనిషికైనా చాలా ధైర్యం కావాల్సి ఉంటుంది! సదరు ధైర్యాన్ని పుంజుకుని అంతరాత్మ రొదకు తావు లేకుండా ఆమెపై రాక్షసత్వం చెలాయించడానికి మాత్రమే అతను తాగుతాడు. అంతే తప్ప తాగుడు వల్ల అత నలా ప్రవర్తించడు. యుక్తాయుక్త జ్ఞానాన్ని నశింపజేసే శక్తి తాగుడులో ఉన్నంతగా మరి దేనిలోనూ ఉండదు. ఉండబోదు కూడా. అందుకే తాగుడు మైకంలో ఎందరెందరో తప్పుడు పనులు చేస్తుంటారు. తప్పుడు పనులు చేసే వాళ్ళు చేసే ముందు ఆత్మధైర్యంకోసం తాగుతుంటారు.

షణ్ముఖం శ్రీలతని కేవలం వో ఆర్నెల్ల క్రితం పెళ్ళి చేసుకున్నాడు. ఆరు నెలలంటే కొత్త దంపతుల విషయంలో అది మోజు తీరిపోయేటంత సుదీర్ఘకాలం కాదు. అనురాగ సరాగాలలో తేలియాడాల్సిన రోజులు!

అలాంటిది ... శ్రీలత జీవితంలో అప్పుడే అంధకారం అలుముకుందంటే ... ఏ స్త్రీకైనా అంతకు మించిన బాధాకరమైన విషయం మరేముంటుంది?

భర్తలు భార్యల్ని కొట్టడం -- హింసించడం— భారతావనిలో పెద్ద వింతేమీ కాదు. కేవలం తమ పురుషాధిక్యతను నిరూపించుకోవడంకోసమే భార్యలపై చెయ్యి చేసుకునే మగవాళ్ళు కూడా ఉన్నారు.

కానీ ...షణ్ముఖంలా కట్టుకున్న భార్యచేత వ్యభిచారం చేయించి, డబ్బు సంపాదించా లనుకునే వాళ్ళు— అందు కంగీకరించని పాపానికి భార్యను అమానుషంగా హింసించే నీచాతినీచులు మాత్రం అరుదనే చెప్పాలి!

ఎవరో తలుపు తట్టినట్టై ఉలిక్కిపడి మంచం మీద నుంచి ఒక్క ఉదుటున లేచి కూర్చుంది శ్రీలత.

ఆమె గుండెలో కొద్ది క్షణాలపాటు రైళ్ళు పరుగులు దీశాయి!

వచ్చేశాడు ... రాక్షసు డొచ్చేశాడు ... మరి కాసేపట్లో తా ననుభవించబోయే నరకయాతనను తలుచుకుని చిగురుటాకులా అల్లాడిపోయిం దామె.

తలుపు తీయటంలో ఆలస్యం జరిగితే తన వీపు మీద పడబోయే పిడిగుద్దుల్ని గుర్తుకు తెచ్చుకుని పరుగున వెళ్ళి తలుపు తీసింది.

వచ్చింది షణ్ముఖం కాదు. పక్కింటి పార్వతమ్మ.

''మీరా?!'' అంది గుండెని సవరదీసుకుంటూ.

''నేనేనమ్మా! ... అరె! ఏం టలా వణికిపోతున్నావు? భయపడ్డావా కొంపదీసి?''

పార్వతమ్మ ప్రశ్నకు తడబడిపోయింది శ్రీలత. ''అహఁ ... అహఁహఁ ... ఏమీ లేదు... ఏమి టిలా వచ్చారు?''

ఆమె వాలకం చూస్తూ ఏమీ లేదన్న ఆమె మాటల్లోని నిజాన్ని శంకించకుండా ఉండలేకపోయింది పార్వతమ్మ. ''ఏమీ లేకపోవడం ఏమిటమ్మా? ఆ ముఖం చూడు--ఎలా ఉబ్బరించి పోయిందో... దేనికో ఏడ్చినట్టున్నావు కూడాను!'' అంటూ లోపలికొచ్చి మంచం మీద కూర్చుం దామె. ''ఏంటమ్మా? ఏం జరిగింది? ఎందుకలా ఉన్నావు?'' అడిగింది కంఠంలో లాలన ధ్వనింపజేస్తూ.

''ఏమీ లేదు, పిన్నిగారూ ... మీ రెందు కొచ్చారో చెప్పండి.'' మాట మార్చబోయింది శ్రీలత.

''ఏం— రాకూడదా?''

''అహఁ ... అది కాదు. సాధారణంగా మీరు మా ఇంటికి రారుకదా? ఏదో పనుండే వచ్చుంటారని అడిగా నంతే!''

''పనిమీదే వచ్చానులే గాని, ముందు నీ సంగతి చెప్పు ...''

''ఏముంది చెప్పడానికి?'' పమిటచెంగును వేలికి చుట్టుకుంటూ ముఖం పక్కకి తిప్పుకుంది శ్రీలత.

ఆమె ముఖాన్ని తిరిగి తన వైపుకు తిప్పుకుంటూ అంది పార్వతమ్మ: ''చూడమ్మా ... ఏదైనా కష్టమొచ్చినప్పుడు ఒంటరిగా ఏడుస్తూ కూర్చుంటే బాధ తీరిపోదు. పైగా పెరుగుతుంది కూడాను. ఎదుటి వ్యక్తికి చెప్పుకున్నప్పుడే మనసుకి శాంతి లభిస్తుంది! ... నువ్వేమైనా ఆర్చేదానివా, తీర్చేదానివా అంటే చెప్పలేను గాని ... నీ బాధేమిటో చెప్పు ...''

పొరుగిల్లు కావడంచేత శ్రీలత భర్త ప్రతిరోజూ తాగొచ్చి ఆమెను కొడుతుంటాడని ఆవిడకూ తెలుసు. అయితే, ఎందుకు కొడతాడు? ఆ భార్యాభర్తలమధ్య ఏమైనా విభేదాలున్నాయా? ఇలాంటి వివరాలు మాత్రం తెలియదు. స్వతహాగా అంత కలుపుగోలు మనిషి కాకపోవడంవల్ల తెలుసుకోవడానికి అంతకుముందెన్నడూ ఆవిడ ప్రయత్నించనూలేదు.

శ్రీలత ఆవిడకు బదులు చెప్పలేదు. ఎలా చెబుతుంది? ఏమని చెబుతుంది? ముఖపరిచయాన్ని మించి ఇంకేమీ లేని వో పరాయి వ్యక్తితో—— తన భర్త తనని వ్యభిచరించ మంటున్నాడనీ, అందు కంగీకరించని పాపానికి తనని చిత్రహింసలు పెడుతున్నాడనీ సిగ్గున్న ఏ ఆడది మాత్రం చెప్పుకో గలుగుతుంది? ... ఎవరైనా సరే, కొత్త వ్యక్తులతో సంతోషాన్ని పంచుకోగలరేమో గాని, దుఃఖాన్ని మాత్రం పంచుకోలేరు.

''చెప్పమ్మా! ... ఏమిటి నీ బాధ? ఇలా అడుగుతున్నానని మరోలా అనుకోవద్దు. మీ ఆయన రోజూ నిన్ను కొట్టడం, తిట్టడం మా అందరికీ తెలుసు. ఏమిటి మీ మధ్య గొడవలు? అత నెందుకలా ప్రవర్తిస్తాడు?'' శ్రీలత ఎంతసేపటికీ మాట్లాడకపోవడంతో తానే మళ్ళీ అడిగింది పార్వతమ్మ.

''ఏమీలేదు పిన్నిగారూ! అంతా నా ఖర్మ—అంతే! అది సరేగాని, ఏదో పనిమీద వచ్చానన్నారుగా— ఏమిటి?'' విషయం దాటేయబోయింది శ్రీలత.

''ఎందుకమ్మా మాట మారుస్తావు? నీ తల్లిలాంటి దాన్ని ... నాకు చెప్పకూడదా నీ బాధేమిటో?''

''ఏముంది, పిన్నిగారూ! ఆయన మితిమీరి తాగుతారు. ఆ మైకంలో ఏదో ఒళ్ళు తెలియక కొడతా రంతే!''

''నే న్నమ్మను. ఆ మాటకొస్తే మీ బాబాయిగారుకూడా రోజూ తాగుతారు. కానీ నామీద ఏనాడూ చెయ్యి చేసుకోరు. కారణం లేకుండా కలహం పుట్టదమ్మా. నువ్వేదో దాస్తున్నావ్?!''

పార్వతమ్మ అలా రెట్టించి రెట్టించి అడగటం శ్రీలతకి చాలా ఇబ్బందికరంగా తోచింది. ''క్షమించండి, పిన్నిగారూ! నన్నేమీ అడక్కండి! ...'' అంటూ తనలోని అసహనాన్ని ముఖకవళికలద్వారా సూచించింది.

ఏదో ఉంది. కానీ, పాపం! పిల్ల చెప్పుకోవడానికి సిగ్గుపడుతోంది! శ్రీలతని చూస్తుంటే పార్వతమ్మకి జాలి ముంచుకొచ్చింది. పెదవుల చివరిదాకా వచ్చిన నిట్టూర్పుని బలిమిన నిగ్రహించుకుని, శ్రీలత బాధపడుతుందేమోనని ''వస్తానమ్మా ...'' అంటూ లేచిం దావిడ.

''మంచిదండి!'' అనబోయిన శ్రీలత చటుక్కున ఏదో గుర్తుకొచ్చి ''అన్నట్టు ఏదో పనిమీద వచ్చానన్నారు ... అదేమిటో చెప్పనేలేదు మీరు?'' అంది.

''అవునుకదూ—నేనూ మర్చేపోయాను ఆ సంగతి. ఆఁ. ఏమీ లేదు. మా వకుళ చెయ్యి కాల్చుకుంది. మీ ఇంట్లో బర్నాల్‌గాని ఉందేమో అడగటాని కొచ్చాను.''

''అరెరె ... ఎలా కాలిందండీ?'' అంటూ ఆవిడ జవాబు చెప్పకముందే పక్క గదిలోకి వెళ్ళి బర్నాల్ ట్యూబ్ తెచ్చి ఆవిడచేత పెట్టింది శ్రీలత.


''అన్నం వార్చమంటే గంజి చెయ్యి మీద ఒలకబోసుకుంది. వస్తానమ్మా! ట్యూబు రేప్పొద్దున్న తీసుకొస్తాను'' అంటూ వెళ్ళిపోయింది పార్వతమ్మ.

ఆవిడను సాగనంపి తలుపు గడియ వేసి మంచం మీద కూలబడిన శ్రీలత గుండెలో మళ్ళీ భయం మొదలైంది!

ఆపై కాసేపటికి షణ్ముఖం రావడం, ఆమెను చావబాదడం, కమిలిన శరీరంతో కుమిలిన హృదయంతో ఆమె నిశ్శబ్ద రోదనం చేస్తుంటే అతగాడు గుర్రుపెట్టి నిద్రపోవడం—అన్నీ యథాప్రకారంగా జరిగిపోయాయి.

● ● ● ●

మర్నాడు బర్నాల్ ట్యూబ్ తిరిగి ఇవ్వటానికి




వచ్చిన పార్వతమ్మ శ్రీలతని మాటల్లో పెట్టి విషయం మళ్ళీ కదలేసింది. "రాత్రి అతను నిన్ను మళ్ళీ కొట్టేడు కదమ్మా? కారణం చెప్పమంటే చెప్పవేమిటి? ప్రతి సమస్యకీ ఏదో ఒక పరిష్కారం ఉండకపోదమ్మా? పెద్దదాన్ని—విషయం ఏమిటో చెప్తే తోచినకాడికి ఏదో ఒక సలహా ఇవ్వలేక పోను—చెప్పమ్మా" అంటూ బుజ్జగించి ప్రశ్నించింది.

ఆవిడ కంఠంలో ధ్వనించిన ఆప్యాయతకు కరిగి పోయింది శ్రీలత. ఆవిడను చూస్తుంటే తల్లి జ్ఞప్తికొచ్చి, "పిన్నిగారూ!" అంటూ ఆవిడ ఒడిలో తల పెట్టుకుని బావురుమంది.

"వూరుకోమ్మా! ఏడవకు—వూరుకో ..." ఆమెను లేవనెత్తి కన్నీరు తుడిచింది పార్వతమ్మ. "ఇరుగు పొరుగు అన్నాక కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలి. చెప్పమ్మా—అసలు సంగతేమిటో చెప్పు."

". . . ."

"అంత చెప్పకూడని విషయమా? ఫర్వాలేదులే—చెప్పమ్మా. అదెంత రహస్యమైనా నా కడుపులో దాచుకుంటానే తప్ప ఇంకెవరితోనూ చెప్పను."

లాలన, ఆప్యాయత సమ్మిళితం చేసి పార్వతమ్మ పదే పదే తరచి తరచి అడగటంతో మనసులో ఆవిణ్ణో ఆప్తురాలిగా స్వీకరించి తన గోడు వెళ్ళబోసుకుంది శ్రీలత.

విషయం విన్న పార్వతమ్మ అప్రతిభురాలైంది. "నిజమేనా, అమ్మా, నువ్ చెప్పింది?" నమ్మలేక పోతూ అడిగింది కాసేపటి తర్వాత.

"అయితే నే నబద్ధం చెప్తున్నా నంటారా?" అంది శ్రీలత కొంగుతో కన్నీ రొత్తుకుంటూ.

"నువ్వబద్ధం చెప్తున్నావని కాదమ్మా! లోకంలో ఇలాంటి దగుల్బాజీ భర్తలు కూడా ఉన్నారంటే నమ్మ బుద్ధికాక అలా అడిగా నంతే" అని కాసే పాగి, అడిగింది పార్వతమ్మ: "అయితే ఏం చేద్దాం అనుకుంటున్నా వమ్మా? ఈ బాధ ఇలా ఎన్నాళ్ళు సహిస్తావు? మీ పుట్టింటి వారికి విషయం తెలియ జేయలేక పోయావా పోనీ?"

శ్రీలత కళ్ళలో మళ్ళీ కన్నీరు నిండుకొంది.

"భగవంతుడు నా కా అదృష్టం కూడా లేకుండా చేశాడు, పిన్నిగారూ! మా పెళ్ళయిన రెణ్ణెల్లకే మా అమ్మా, నాన్నా ఇద్దరూ పోయారు. ట్రెయిను నేక్సిడెంట్‌లో దుర్మరణం పాలయ్యారు. వాళ్ళకు నే నొక్కర్తినే సంతానం!"

"అయ్యో! ఎంత దురదృష్టవంతురాలి వమ్మా! ఆ భగవంతుడికి అదేం మాయ రోగమో గాని, మంచి వాళ్ళకే తెచ్చి పెడతాడు కష్టాలన్నీ." శ్రీలతపై కలిగిన జాలి పార్వతమ్మతో భగవంతుణ్ణి నిందింప జేసింది. "నువ్విలా సహిస్తూ ఉన్నంత కాలం అత నలా రెచ్చిపోతూనే ఉంటాడు. గట్టిగా ఎదురు తిరిగితే సరి ..."

"ఎందుకు, పిన్నిగారూ! వీపుమీద మళ్ళీ వాతలు పెట్టించుకోవడానికా?" విరక్తిగా నవ్వింది శ్రీలత.

'అంటే' అన్నట్టుగా చూసిన పార్వతమ్మతో గతంలో జరిగిన వో సంఘటన గురించి చెప్పింది శ్రీలత. భర్త దవుష్ట్యానికి సహించలేక ఒక నా డామె ఎదురు తిరిగితే సిగరెట్‌తో వీపంతా పొక్కి పోయేలా వాతలు పెట్టాడుట షణ్ముఖం. ఆ సంఘటన వివరించి, "చూడండి, పిన్నిగారూ! ఆ మచ్చ లింకా ఉన్నాయి" అంటూ జాకెట్ పైకెత్తి వీపు చూపించిం దామె.

"ఛీ, ఛీ! అలాంటి రాక్షసుడితో ఎలా కాపురం చేస్తున్నా వమ్మా? నే నైతే పిడికెడు విషం మింగి చచ్చేదాన్ని. లేకపోతే విషం పెట్టి అతన్నే చంపుండే దాన్ని." జాకెట్ కిందికి లాగుతూ అన్నది పార్వతమ్మ.

"నిజమే, పిన్నిగారూ! ఎక్కడైనా విషం దొరికితే బాగుణ్ను" అని శ్రీలత ఇంకా ఏదో అనబోతుంటే పక్క పోర్షన్‌లోనుంచి "పార్వతీ!" అన్న పిలుపు వినిపించింది.

"మీ బాబాయిగా రొచ్చిన ట్టున్నారు. మళ్ళీ వస్తానమ్మా" అంటూ వెళ్ళిపోయింది పార్వతమ్మ.

● ● ● ●

ఆ రాత్రి ఆ మాటా, ఈ మాటా చెప్తూ పార్వతమ్మ శ్రీలత విషయం భర్త కుటుంబరావు చెవిన వేసింది. అంతా సావధానంగా విన్న కుటుంబరావు ఆఖరి ముక్క విని ఉలిక్కిపడ్డాడు.

"నీ కసలు బుద్ధుందా పార్వతీ?"

". . . ." తెల్లబోతూ చూసింది పార్వతమ్మ.

"లేకపోతే ఏమిటి? ఆ అమ్మాయి దుఃస్థితికి జాలిపడటంలో తప్పు లేదు. కానీ నువ్విచ్చిన సలహా ఏమిటి? ఆ పరిస్థితిలో ఉన్న ఆ అమ్మాయి మనసులో ఎంత ఆందోళన, ఉద్రేకం నిండుకుని ఉంటాయో నీకు తెలుసా? నీ మాటల ప్రభావం వల్ల ఆ అమ్మాయి నిజంగా ఏ మందో మింగి ఆత్మహత్య చేసుకుంటే? లేక అతన్ని చంపడానికి ప్రయత్నిస్తే? ఏమవుద్దో వూహించావా?" తీవ్రంగా అన్నాడు కుటుంబరావు.

"నిజమేనండీ! ఏదో మాట వరస కన్నట్టుగా అన్నానే గాని, నే నంత దూరం ఆలోచించలేదు." నొచ్చుకోలుగా అంది పార్వతమ్మ.

ఒక క్షణం తర్వాత మళ్ళీ ఆవిడే అంది: "అయినా అలాంటి వెధవని మందు పెట్టి చంపినా పాపం లేదు లెండి!"

"అత నెలాంటి వాడన్నది ప్రశ్న కాదు, పార్వతీ! ఆ అమ్మాయి జీవితంలో అలుముకున్న చీకటిని ఎలా తరిమి కొట్టాలో ఆలోచించాలి మనం! వాళ్ళిద్దరిలో ఏ ఒక్కరి చావూ ఈ సమస్యకు పరిష్కారం కాదు. అతనికి విడాకు లిచ్చేసి ఆ అమ్మాయి తన దారి తాను చూసుకోవడం మంచిదేమో అనిపిస్తోంది నాకు" అన్నాడు కుటుంబరావు.

"నిజమే. కాని ఆ అమ్మాయి ఒంటరిది. విడాకులు తీసుకోవాలంటే దానికి బోలెడంత తతంగ ముందిగా? అవన్నీ ఆ అమ్మాయికి తెలియొద్దూ?" అని విషయాన్ని అంతటితో విడిచిపెట్టకుండా, "ఆ అమ్మాయిని చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతోందండీ! పాపం! పుట్టింటి అండ కూడా లేదు. ఆ రాక్షసుడు ఏదో ఒకనాడు ఆ పిల్ల పీక పిసికేసి చంపేసినా చంపేస్తాడు! ... మీకు పుణ్యముంటుంది గాని, ఎవరైనా లాయరుతో మాట్లాడి మీరన్నా ఆ విడాకు లేవో త్వరగా దొరికేలా చూడండీ!" అంటూ తెగపోరింది పార్వతమ్మ.

"అన్నీ నీ ఇష్టమే అన్నట్టు మాట్లాడుతున్నావ్! భర్తకు విడాకు లివ్వడానికి ఆ అమ్మాయి సిద్ధంగా ఉండొద్దూ?" అని కుటుంబరావు సందేహాన్ని వ్యక్తం చేయగా, "ఎందు కిష్టపడదూ? లక్షణంగా ఇష్టపడుతుంది" అంటూ శ్రీలత తరపున తానే హామీ ఇచ్చింది పార్వతమ్మ.

● ● ● ●

భార్య ద్వారా విషయం విన్నాక క్యూరియాసిటీ కొద్దీ శ్రీలత, షణ్ముఖాలను తానూ అబ్జర్వ్ చేయడం మొదలుపెట్టాడు కుటుంబరావు.

శ్రీలత షణ్ముఖం సమక్షంలో నరకాన్ని చవి చూస్తోందన్న భార్య మాటల్లో ఉత్ప్రేక్ష ఏమాత్రమూ లేదని ఒక్క వారం రోజుల్లోనే గ్రహించేశాడు కుటుంబరావు.

ఒక నాడు షణ్ముఖం కొట్టిన దెబ్బకి శ్రీలత తల చిట్లి, ఆమెను హాస్పిటల్‌లో జాయిన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. షణ్ముఖం కొట్టి వెళ్ళి పోగా, కుటుంబరావు దంపతులే ఆ నా డామెను

హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. "కొద్దిలో ప్రాణగండం తప్పిం" దన్నాడు డాక్టరు. అది జరిగిన తర్వాత శ్రీలత బ్రతుకు నెలాగైనా సరే చక్కదిద్దాలన్న బలీయమైన కోరిక కుటుంబరావులో కూడా ఏర్పడింది.

షణ్ముఖం లాంటి నీచుల్లో పరివర్తన వస్తుం దనుకోవడం వెర్రితనం అనిపించుకుంటుందే తప్ప, ఎన్నటికీ అది నిజం కాదు. కాబోదు. శ్రీలత బ్రతుకు బాగుపడాలంటే ఆమెను ఆ తుచ్ఛుడి బారి నుండి శాశ్వతంగా తప్పించడం ఒక్కటే మార్గం! అంటే... ఆమెతో అతనికి విడాకు లిప్పించాలి.

తన ఉద్దేశం చెప్పి, "నువ్వేమంటావమ్మా?" అనడిగాడు శ్రీలతని కుటుంబరావు.

"అంతకన్నానా, బాబాయిగారూ! ..." అంటూ రెండు చేతులూ ఎత్తి నమస్కరించింది శ్రీలత.

ఆ మర్నాడు ఆ వీధిలోని కొంత మంది పెద్ద మనుషుల్ని పోగుచేసి, షణ్ముఖానికి గడ్డి పెట్టించి, "ఈ అమ్మాయి ఇక నుంచి నీతో ఉండదు. త్వరలో నీకు లాయరు నోటీ సొస్తుంది. మిగతా వ్యవహారా లన్నీ కోర్టులో పరిష్కరించుకుందాం" అంటూ, పదుగురి ముందూ ఆ నాటి నుండి శ్రీలత బాధ్యత తాను వహిస్తున్నట్టు ప్రకటించాడు కుటుంబరావు.

షణ్ముఖంతో శ్రీలత ఎన్ని బాధలు పడుతున్నదీ ఆ వీధిలోని ప్రతి ఒక్కరికీ కొద్దో గొప్పో తెలియకుండా లేదు. కుటుంబరావు నిర్ణయానికి అందరూ హర్షం వెలిబుచ్చారు.

షణ్ముఖం తోక తొక్కిన తాచులా చర్రున లేచాడు. "ఎన్నాళ్ళనుండీ ఈ భాగోతం లం ... కానా! ఈ ముసిలోణ్ణి మరిగి నా మీద యుద్ధం ప్రకటిస్తున్నావా? చూడు, నిన్నేం చేస్తానో" అంటూ శ్రీలత, కుటుంబరావులకు లేనిపోని అక్రమ సంబంధం అంటగట్టి నీచాతినీచంగా మాట్లాడాడు.

అంత నింద వచ్చి నెత్తిమీద పడ్డా కుటుంబరావు చలించలేదు. సకల ప్రయత్నాలూ చేసి శ్రీలతకి షణ్ముఖం పీడ వదిలిపోయేలా చేశాడు ... కోర్టులో వారిద్దరికీ విడాకులు మంజూరయ్యాయి!

● ● ● ●

"వ్యవహారం వో కొలిక్కొచ్చిం దన్నమాటే గాని సమస్య అప్పుడే పూర్తిగా విడిపోయినట్టు కాదు, పార్వతీ! ... శ్రీలత భవిష్యత్తు కోసం ఏదైనా చెయ్యాలి మనం! ఎల్లకాలం ఆ అమ్మాయిని మన ఇంట్లో ఉంచేసుకోలేం కదా! తన కేదైనా ఆధారం కల్పించాలి."

"అవునండీ! నేనూ అదే ఆలోచిస్తున్నాను. ఏం చేస్తే బాగుంటుం దంటారు?"

"అదే నాకూ పాలుపోవడం లేదు. టెన్త్ వరకూ చదువుకుంది కదా—ఏదైనా ఉద్యోగం కోసం ప్రయత్నిద్దాం. ముందు ఆ అమ్మాయిని తన కాళ్ళ మీద తాను నిలబడేలా చేస్తే, ఆ తర్వాత తన భవిష్యత్తు తానే తీర్చి దిద్దుకుంటుంది."

"నిజమేనండీ! ఆ ప్రయత్నమేదో ఈ రోజు నుండే మొదలు పెట్టండి!" అంటూ భర్త ఉద్దేశాన్ని ప్రోత్సహించింది పార్వతమ్మ.

"నీ కేదైనా ఉద్యోగం చూడా లనుకుంటున్నానమ్మా! ... చేస్తావా?" అనడిగాడు కుటుంబరావు శ్రీలతని కేకేసి.


"తప్పకుండా చూడండి, బాబాయిగారూ! ఇప్పటికే మూడు నెలల్నుంచి మీకు భారంగా తయారయ్యాను. ఇంకా ఎన్నాళ్ళని మోస్తారు నా భారం?" అంది శ్రీలత.


"నువ్వు మాకు భార మయ్యావని కాదమ్మా! నే నా ఉద్దేశంతో అనలేదు" అని కుటుంబరా వింకా ఏదో అనబోతుంటే మధ్యలో అడ్డుపడింది శ్రీలత. "మీ మనసెలాంటిదో నాకు తెలియదా బాబాయిగారూ? మీరేది చేసినా నా మంచికోసమే చేస్తారు. మీ ఇష్టప్రకారమే కానివ్వండి" అని అక్కడినుంచి వెళ్ళిపోయింది.


ఏదైనా తలపెడితే అది జరిగేదాకా వూరుకోలేడు కుటుంబరావు. శ్రీలత ఉద్యోగంకోసం తీవ్రమైన ప్రయత్నాలు ప్రారంభించాడు. అయితే వూ అన గానే వూడిపడిపోయేటంత సామాన్యమైన విషయం కాదు ఈ రోజుల్లో ఉద్యోగం దొరకటం! మరో ఆరు నెలలు గడిచిపోయాయే గాని, శ్రీలతకు ఉద్యోగం దొరకలేదు.

● ● ● ●

ఒక రోజు ఏదో మాటల సందర్భంలో పార్వతమ్మ హఠాత్తుగా వో ప్రతిపాదన చేసింది. "ఏమండీ! శ్రీలతకి ఉద్యోగం చూడ్డం కన్నా పెళ్ళిచేయడానికి





ప్రయత్నిస్తే మంచిదేమో నండీ ...! మనం తప్పు ఎవ్వరగాలేని పిల్ల. నోట్లో నాలిక లేని మనిషి! ఒక వేళ ఉద్యోగం దొరికితే అది చేసుకుంటూ బ్రతికేస్తుందే తప్ప తనకై తాను ఆ పిల్ల వేరెవర్నీ పెళ్ళి చేసుకోలేదు. అసలే భయస్తురాలు. అంత చొరవ, తెగింపు ఆ అమ్మాయిలో ఉంటాయని నే ననుకోను. పాపం! పట్టుమని పాతికేళ్ళున్నా లేవు. ఏ అచ్చటా ముచ్చటా లేకుండా జీవితాంతం ఒంటరిగా ఎలా బ్రతుకుతుందండీ? మీ ఎరికలో ఏమైనా సంబంధాలుంటే చూడండి!''

భార్య మాటలకు విస్తుపోయాడు కుటుంబరావు. ఇతరుల శ్రేయస్సు మనసారా కాంక్షించే ఆమె మంచితనానికి మురిసిపోయాడు కూడా. ''అదీ నిజమే పార్వతీ! కానీ ఈ రోజుల్లో అన్నీ సవ్యంగా ఉన్న ఆడపిల్లలకే పెళ్ళిళ్ళు కావడం కష్టంగా ఉంది. అలాంటిది ఒకసారి పెళ్ళైయి, భర్తకు విడాకులిచ్చిన శ్రీలతని చేసుకోవడానికి ఎవరు ముందుకొస్తారు చెప్పు? డబ్బు వెదజల్లగలిగితే సాధ్యం కావచ్చుగాని మన కా స్తోమ తేదీ? ఇంకా వకుళ పెళ్ళి చెయ్యాల్సిన బాధ్యత కూడా ఒకటి మనమీద ఉంది.''

''వకుళ విషయం ఇప్పటి మాట కాదుగదా! మరో పదేళ్ళ తర్వాత ఆలోచించాల్సిన సంగతది. మనం చెయ్యలేకపోతే అబ్బాయిలేడూ? ఆ మాటకేంగాని, ముందు శ్రీలత గురించి ఆలోచించండి'' అంది పార్వతమ్మ.

ఆ దంపతులకు ప్రస్తుతం ఉన్నది ఇద్దరే సంతానం. కొడుకు భానుమూర్తికీ, కూతురు వకుళకీ మధ్య పన్నెండేళ్ళు వ్యత్యాసం. వాళ్ళిద్దరికీ మధ్య ముగ్గురు పిల్లలు పుట్టి పురిట్లోనే పోవడం జరిగింది. భానుమూర్తి ప్రస్తుతం ఉద్యోగ రీత్యా వేరే వూర్లో ఉంటున్నాడు. అంతకు ముందటేడే పెళ్ళి చేశా రతనికి. మరి కొద్ది నెలల్లో అతను తండ్రి కూడా కాబోతున్నాడు.

''సరే ప్రయత్నిద్దాం'' అన్నాడు కుటుంబరావు భార్య మాటను త్రోసిపుచ్చలేక.

''ఏమండీ! నా కొకటి తోస్తోంది. మా తమ్ముడు రమణ గాడికి పిల్లల్లేరు కదా. లోపం మా మరదలిదే అనీ, ఆమె కింక పిల్లలు పుట్టరనీ చెప్పిందట డాక్టరమ్మ. సంతానంకోసం వాడు మరో పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నట్టు మొన్నొచ్చినప్పుడు నాతో అన్నాడు. మా మరదలు కూడా అందు కిష్టపడిందట! శ్రీలత విషయం గురించి వాడితో చెప్పి-పెళ్ళి కొప్పిస్తే ఎలా ఉంటుందంటారు?''

''మంచి ఆలోచనే! ఉత్తరం రాసి మీ తమ్ముణ్నోసారి ఇక్కడికి రప్పించు'' అన్నాడు కుటుంబరావు.

తమ సంభాషణ అంతా ప్రక్క గదిలోంచి శ్రీలత ఆలకిస్తూ ఉందని ఆ దంపతులకు తెలియదు. అదే విషయం గురించి చాలాసేపటిదాకా వాళ్ళింకా చాలా చాలా విషయాలు మాట్లాడుకున్నారు.

• • • •

మర్నాడు —

'ఇంత పొద్దుపోయినా శ్రీలత ఇంకా లేవదేమిటి చెప్మా?' అనుకుంటూ ఆమె గదిలోకి వెళ్ళిన పార్వతమ్మకి మంచం మీద శ్రీలతకు బదులుగా వో చీటీ మడత పెట్టి ఉండటం కనిపించింది!

ఆత్రంగా దాన్నందుకుని మడతలు విప్పి అందులోకి దృష్టి సారించింది పార్వతమ్మ.

''పూజనీయులైన బాబాయిగారికి, పిన్నిగారికి—

శ్రీలత నమస్కరించి వ్రాయునది:

మీకు చెప్పకుండా మీ ఇంటి నుంచి వెళ్ళిపోతున్నాను. నన్ను క్షమించండి.

ఇన్నాళ్ళూ మీ కన్నబిడ్డలా నన్నాదరించి, నా పట్ల ఎనలేని ఆప్యాయతాదరాలు చూపిన మీ ఎడల ఇలా ప్రవర్తించవలసి రావడం నిజంగా నా కెంతో బాధగా ఉంది. అయినా ఇలా చెయ్యక తప్పటం లేదు.

రాత్రి నా గురించి మీరు మాట్లాడుకున్నదంతా విన్నాను. నా జీవితాన్ని సరిదిద్దాలన్న తపనతో— నా క్షేమాన్ని కాంక్షించి పిన్నిగారు నన్ను వారి తమ్ముడికి రెండో భార్యగా చేద్దామన్న ప్రతిపాదన చేశారు. బాబాయిగారూ! మీరుకూడా దానికి ఇష్టపడ్డారు.

మీకన్నా నా కీ లోకంలో శ్రేయోభిలాషు లెవ్వరూ లేరు. నాకు తెలుసు, మీ రేం చేసినా నా మంచి కోసమే చేస్తారని. ప్రతి మనిషిలోనూ స్వార్థం పెచ్చరిల్లిపోతున్న ఈ రోజుల్లో ఏమాత్రమూ సంబంధం లేని వో పరాయి వ్యక్తి బాగు కోసం ఇంతగా తాపత్రయపడే మీలాంటి వ్యక్తులు కోటికొక్కరు కూడా ఉండరేమో! కానీ, బాబాయిగారూ! నా మూలంగా మరో అభాగ్యురాల్లో మనోక్షోభ కలిగించటం నా కెంతమాత్రమూ ఇష్టం లేదు. పిన్నిగారి తమ్ముడి భార్య తన భర్తకు ఎదురు చెప్పలేక, అతను రెండో పెళ్ళి చేసుకోవడానికి అంగీకరించి ఉంటుందే తప్ప, మనఃస్ఫూర్తిగా ఇష్టపడి మాత్రం కాదు. ఏ స్త్రీ కూడా తన భర్తని మరో వ్యక్తితో పంచుకోవడానికి మనసారా అంగీకరించదు. అలా జరిగితే క్షోభించకుండా ఉండదు.

మీ నవనీత హృదయాలలో అనుకున్నది సాధించే వరకూ విశ్రమించని పట్టుదల కూడా ఉందని నే నేనాడో గ్రహించాను. ఉదాహరణ: నాకూ, షణ్ముఖానికీ విడాకు లిప్పించడంలో మీరు చూపిన శ్రద్ధ! మీలో ఆ వూహ జనించాక నేనింకా మీ వద్దనే ఉంటే ఏదో ఒకనాటికి మీరు అనుకున్నది నెరవేర్చి తీరుతారు. తన్మూలంగా వో సాటి స్త్రీ కన్నీటికి నేను కారకురాలి నవుతాను. చెప్పేనుగా, నా కది ఎంతమాత్రమూ ఇష్టం లేదు. అందుకే మీ చల్లని నీడ నుండి పారిపోతున్నాను. ఇంతకన్నా మంచి ఆశ్రయం ఇంకెక్కడో దొరుకుతుందని కాదు. ఎందుకో నా మనసు కిలా తోచింది. వెళ్ళిపోతున్నాను. నా గురించి మీరేమీ విచారించకండి. నేను మా వూరు — అంటే మా నాన్నగారి వూరు—వెళ్తున్నాను. అక్కడ కోటేశ్వరరావుగారని మా నాన్నగారి స్నేహితు డొకాయన ఉన్నాడు. ఆయన ద్వారా ఏదైనా బ్రతుకు తెరువు ఏర్పరచుకుంటాను. జీవితంలో ఏదో ఒక రకంగా స్థిరపడ్డాక మళ్ళీ వో సారి వచ్చి మిమ్మల్ని దర్శించుకుంటాను. సెలవు.

—మీ శ్రీలత.''

చదవడం ముగించి, ''ఏమండీ! ఏమండీ !'' అంటూ భర్త దగ్గరికి పరుగుదీసి విషయం చెప్పి, ఆ కాగితం అతని చేత పెట్టింది పార్వతమ్మ.

ఉత్తరం చదివి దీర్ఘంగా నిట్టూర్చాడు కుటుంబరావు.

''పిచ్చిపిల్ల! తన కిష్టం లేదని చెప్తే మన మేమైనా మెడలు వంచి పెళ్ళి చేస్తామా? అనవసరంగా తొందరపడి వెళ్ళిపోయింది. ఎలా వెళ్ళిందో ఏమో? క్షేమంగా చేరిందో, లేదో? ముందుముందుకి ఎన్ని కష్టాలు పడనున్నదో? వీలైతే అక్కడికి వెళ్ళి వచ్చజెప్పి తీసుకొచ్చేయండి!'' అంది పార్వతమ్మ బాధగా.

''అలాగే, పార్వతీ!'' అన్న కుటుంబరావు ''నిజంగా మంచి ముత్యం లాంటి పిల్ల! అప్రాచ్యుడు గనక ఆ షణ్ముఖం చెయ్యి జార్చుకున్నాడు. దేనికైనా అదృష్టం ఉండాలంటూ రందుకే!'' అంటూ షణ్ముఖాన్ని తలుచుకుని జాలిపడ్డాడు. *